నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | మార్చి 30, 2024 | www.navatelangana.com

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో సామాజిక పరివర్తన మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ రమేష్‌రెడ్డి వైద్యుల బృందం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఒక్కరికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘ అధ్యక్షురాలు నిర్మల, వైద్యులు శివ కుమార్, శ్రీనివాస్, మాజి సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ అనిత, సురేష్, గంగారెడ్డి, ముత్యం పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-ఉట్నూర్



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని వారి నివాసంలో మంత్రి సీతక్కతో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణలు మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ ఉన్నారు.

ప్రచారం షురూ..!

- మండల స్థాయి నాయకులతో సమావేశాలు
- పల్లెలను చుట్టేందుకు సిద్ధమవుతున్న ప్రచార రథాలు
- వ్యూహాలకు పదును పెడుతున్న ప్రధాన పార్టీలు
- ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో రసవత్తర పోరు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. ఆదిలాబాద్ లోక్‌సభ బరిలో నిలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు వారి అభ్యర్థులను ప్రకటించడంతో సార్వత్రిక పోరు మరింత రసవత్తరంగా మారనుంది. కొన్ని రోజుల పాటు టికెట్ల వ్యవహారం ఉత్కంఠ రేకెత్తించగా.. అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచార పర్వంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఇప్పటికే మండల స్థాయిలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌ను సమాయత్తం చేస్తుండగా.. రెండు రోజుల క్రితం టికెట్ పొందిన కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచారాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం బరిలో నిలిచిన ముగ్గురు అభ్యర్థులు కూడా ఆదివాసీ గిరిజనులు కావడంతో విజయం ఎవరిని వరిస్తుందోనని ఉత్కంఠ రేకెత్తిస్తోంది. విజయం కోసం మూడు పార్టీలు సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం ఆసక్తికరంగా మారుతోంది. ఆదిలాబాద్ స్థానం దక్కించుకోవడంపై అన్ని పార్టీలు ఎవరికి వారు వ్యూహాలు రచిస్తుండటం ప్రాధాన్యంశంగా మారింది.









నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల సమరం వేడెక్కుతోంది. ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో సార్వత్రిక పోరు రసవత్తరంగా మారనుంది. ఎవరికి వారు ఈ సీటును దక్కించుకునేందుకు అస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడంతో అన్ని పార్టీలు లోక్‌సభ సమరంపై దృష్టిసారించాయి. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో లోక్‌సభ ఎన్నికలు హస్తం పార్టీకి కీలకంగా మారాయి. ఎలాగైనా అత్యధిక ఎంపీ సీట్లు గెలిచి అధిష్టానానికి కానుకగా ఇవ్వాలని ఆ పార్టీ ముఖ్యులు భావిస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ చేతిలో ఉన్న ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో విజయం సాధించడమే ఏజెండాగా కాంగ్రెస్ భావిస్తోంది. టికెట్ కోసం 22మంది ఆశావహులు దరఖాస్తులు చేయగా.. అభ్యర్థుల వడపోత తర్వాత చివరగా ఆదివాసీ హక్కుల పోరాటయోధురాలైన ఆత్రం సుగుణను ఎంపిక చేస్తూ ఆ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ స్థానంలో విజయం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పొందిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటి జిల్లాలో పునర్వైభవం సాధించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఆదివాసీ తెగకు చెందిన ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ కేటాయించి పోటీలో నిలిపింది. ఇక బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సోయం బాపురావును కాదని.. మాజీ ఎంపీ గోడం నగేష్‌కు టికెట్ కేటాయించి ఎన్నికల బరిలో నిలుపుతోంది. ఈ ముగ్గురిలో బీఆర్ఎస్, బీజేపీ నుంచి ఆత్రం సక్కు, గోడం నగేష్‌లు ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా రాణించగా.. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ సామాజిక ఉద్యమ కారిణిగా ప్రజల్లో ఇప్పటికే గుర్తింపు సాధించారు. ఈ ముగ్గురు అభ్యర్థులు సైతం బలమైన నేపథ్యం కలిగిన వారు కావడంతో జనాల్లో విజయావకాశాలపై చర్చ ప్రారంభమైంది.

పల్లెల్లోకి ప్రచార రథాలు..!

ఎన్నికలకు మరో నెలన్నర వరకు సమయం ఉండటంతో ప్రస్తుతం ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు జిల్లాలోని ముఖ్య నాయకులతో సమావేశమవుతూ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నారు. మండల స్థాయిలో కీలక నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమవుతూ ప్రచార సరళిపై చర్చిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కాంగ్రెస్,బీజేపీలకు చెందిన ముఖ్య నాయకులు జిల్లాలో సభలు నిర్వహించి ప్రచార పర్వానికి తెరలేపారు. బీఆర్ఎస్ సైతం త్వరలోనే సభలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే పల్లెల్లో ప్రచారం నిర్వహించటానికి ఆయా పార్టీలు ప్రచార రథాలను సిద్ధం చేయిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే జిల్లాలో మైకుల మోత మళ్లీ మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

నేరరహిత సమాజం కోసమే కార్డన్ సెర్చ్

- ముధోల్ సీఐ మల్లేష్
- సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం...



నవతెలంగాణ-ముధోల్

నేరరహిత సమాజం కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు ముధోల్ సీఐ జి.మల్లేష్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముధోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ధృవీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. వాహనానికి సంబంధిత పత్రాలు కలిగిఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని అన్నారు. గ్రామాలలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారాన్ని అందించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్ ద్వారా ఎవరికి ఓటీపీలు చెప్పకూడదన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవహహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఎవరిపై రెచ్చకొట్టే విధంగా పోస్టులు చేయకూడదని అన్నారు. ఈ కార్డెన్ సెర్చ్ లో సరైనవాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు 55, త్రివిల్లర్స్ 6ను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సాయి కిరణ్, మోహన్‌రావు, రాజు, శివ, గణేష్, 20మంది పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు

- 32 కేసులు.. 22 మంది అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం విక్రయించిన, దేశీదారు తీసుకువచ్చిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ విజేందర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి నిత్యం తనిఖీలు చేస్తు, ఇప్పటివరకు 32 కేసులు నమోదు చేసి, 22 మందిని అరెస్టు చేశామన్నారు. నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు 8 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. ఇందులో ఇద్దరిపై బైండోవర్ ఉల్లంఘన కేసులు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయించి, దేశీదారు తీసుకువచ్చిన చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్టు కుడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

మొర్రిపండ్ల కోసం చెట్టెక్కి కిందపడి మహిళకు గాయాలు



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని మత్తడిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద సుద్దగూడ గ్రామానికి చెందిన వెడ్మ గిరిజ సమీపంలోని అడవి ప్రాంతానికి మొర్రి పండ్ల సేకరణకు వెళ్లి చెట్టు ఎక్కి చెట్టు పైనుంచి కాలుజారి కింద పడటంతో కాలుకు గాయాలు అయ్యాయని ఎంపీపీ పంద్ర జైవంత్ రావు తెలిపారు. శుక్రవారం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులు అడవుల్లో దొరికే పండ్లపై ఆధారపడి తమ జీవనాన్ని గడుపుతారని వారికి ప్రభుత్వ పరంగా ఉపాధి అవకాశాలను కల్పించి, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార శాఖ అధికారి బి.మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అందులో భాగంగానే శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని అన్నారు. రైతులు తేమ శనగ పంటను ప్రభుత్వ మద్ధత్తు ధరకు అమ్ముకోవాలని కోరుచున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ గంగన్న రైతులు పాల్గొన్నారు.

బీజేపీకీ వ్యతిరేకంగా ఓటు వేయడమే నిజమైన దేశభక్తి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కురపాటి రమేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకీ వ్యతిరేకంగా ఓటు వేయడమే అసలైన దేశభక్తి అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కురపాటి రమేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సమావేశాన్ని, జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్పొరేటర్ సంస్థలకు లాభాలు తెచ్చి పెట్టెలా కార్మిక చట్టాలను చేసిందన్నారు. కార్మికులను కట్టుబానిసలను చేయడానికి పూనుకున్నారని అన్నారు. అదానీ, అంబానీల ఆస్తులు పెంచి, ఆకలి సూచీలో దేశాన్ని 111వ స్థానంలో నిలిపిందన్నారు. 104 కోట్ల మంది పేదలు దారిద్ర్యంలో ఉన్నారని ఐక్య రాజ్యసమితి పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. మతాల మధ్యన చిచ్చు పెట్టి అన్నదమ్ముల్లా కలిసి ఉన్న దేశ పౌరులను విడదీసే ప్రయత్నం బీజేపీ చేస్తుందని మండిపడ్డారు. అల్లర్లు సృష్టించి ఎన్నికల్లో లబ్ది పొందే కుటిల నీతికి బీజేపీ పాల్పడుతోందని అన్నారు.

వేల కోట్లకు అవినీతి పాల్పడిన బీజేపీ...

ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బీజేపీపై కనీసం కేసు నమోదు కాలేదని అన్నారు. కానీ ప్రతిపక్షాలపై ఈడీని ఉసిగొల్పి అరెస్టులు చేయిస్తుందని విమర్శించారు. లిక్కర్ మాఫియా నుంచి రూ.55 కోట్ల బీజేపీకీ ముట్టాయని కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీనీ దేశభక్తులైన దేశ పౌరులు ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సమవేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కుమార్, జిల్లా కోశాధికారి కె.సునీత, జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, ఎం.గంగన్న, డి.వెంకటమ్మ, లింగాల చిన్నన్న, కార్యదర్శులు ఎం.సుజాత, అగ్గిమల్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.గంగయ్య, మామిడి స్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎంను కలిసిన నాయకులు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని పలు సమస్యలపై బోథ్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదారాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి, మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలని విన్నవించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి బోథ్‌లోని బహిరంగ సభలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు డిగ్రీ కళాశాల మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్టు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సీఎం త్వరలోనే రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు ఆయనను తన ఫోటోతో పాటు మనమడు ఫోటోను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుర్మే మహేందర్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బారే నాగేందర్, పద్మశాలి సంఘం మండల ఉపాధ్యక్షుడు ఆడెపు కిరణ్ కుమార్, నాయకుడు బొజ్జ సాయన్న పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను
భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మెన్, పార్లమెంటరీ కోఆర్డినేటర్ సెడ్మకి ఆనంద్ రావ్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్ వద్ద ఆదివాసీ కాంగ్రెస్ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ముద్దుబిడ్డ ఆత్రం సుగుణకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి ధనసరి సీతక్కకు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదివాసులను గుర్తించి, ఎంపీ టికెట్ కేటాయించినందుకు ఆత్రం సుగుణను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జీఓ నెంబర్ 3ను తొలగించి, గిరిజన ఆదివాసులకు అన్యాయం చేసిందన్నారు. కేవలం కాంగ్రెస్ హయాంలో ఆదివాసీ గిరిజనులకు ట్రైబల్ బెటాలియన్, ఏజెన్సీ డీఎస్సీ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, గిరిజనులకు పోడు పట్టాలు, ఈజీఎస్ ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి అభివృద్ధి చేసిందన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేసి ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యంగా కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు అర్క శేషరావ్, ఆదివాసీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ రావ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గెడం పరశురాం, నాయకులు కొట్నాక్ లింభారావ్, ఎం.నాగోరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడెం : ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని స్థానిక హరిత రిసార్ట్‌లో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం ఆత్రం సుగుణ పేరు ఖరారు. చేసినందుకు గాను, కాంగ్రెస్ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి అయిన ఆత్రం సుగుణ గెలుపునకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్కు రాజు, సలీం, పడిగెల భూషణ్, తాళ్లపెల్లి రమేష్, రహీం, రామ్‌రెడ్డి, వాజీద్‌ఖాన్, షేక్ రఫీక్, బబ్లు, షర్ఫుద్దీన్, ఎంఏ అత్తు పాల్గొన్నారు.

నార్నూర్



కడెం



నైతికతకు నిలయాలు శిశు మందిరాలు

నవతెలంగాణ-నార్నూర్

ఆధ్యాత్మిక నైతికతకు నిలయాలు శిశు మందిరాలు అని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల 30వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. శిశు మందిరాలు దేశ వ్యాప్తంగా విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పే ఏకైక సంస్థ అని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు పోషకులకు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జీ చైర్మెన్ సురేష్ ఆడే, మాజీ జెడ్పీటీసీ రూపావతి న్యానోనా పుష్కర్, జూనియర్ కళాశాల అధ్యాపకుడు బాలాజీ కాంబ్లే, నాయకులు జాదవ్ రెడ్డినాయక్, మహేందర్, జాదవ్ మనోజ్, గోవింద్, పాఠశాల కార్యదర్శి ప్రకాష్ రాథోడ్, ప్రధానోపాధ్యాయుడు మిలింద్ దుర్గే, ఉపాధ్యాయ సిబ్బంది రాజు, భాగ్య ఉన్నారు.

సామాజిక సేవలో రాణించడం అభినందనీయం

నవతెలంగాణ-ఉట్నూర్



నేటి యువత సామాజిక సేవ రంగంలో రాణించడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం అన్నారు. శుక్రవారం లక్కారంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో యువ నాయకులు అజ్మీర జయచంద్ర ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలం ప్రజల దాహార్తిని తీర్చడానికి నీటి సౌకర్యం కల్పించడం మంచి విషయం అన్నారు. ఇలాగే సామాజిక సేవలో మరింతగా రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు రఘు, కలీం పాషా, హైమద్, బంజారా సంఘం నాయకులు, లక్కారం గ్రామస్తులు పాల్గొన్నారు.

మళ్లీ నిలదొక్కుకుంటాం : టీడీపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకొని మళ్లీ నిలదొక్కుకుంటామని టీడీపీ నాయకులు అల్లూరి రాజారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పేదల సంక్షేమం కోసం 1982లో పార్టీని స్థాపించి తొమ్మిది నెలల కాలంలో అధికారం చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌దేనని అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి పేదలకు అండగా టీడీపీ నిలించిందని తెలిపారు. ఎన్ని ఆటుపోట్లనైనా తట్టుకొని మళ్లీ నిలదొక్కి అధికారం చేపడుతామని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఫీక్, నాగన్న, సుభాష్, చంద్రయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గోడపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు శుక్రవారం భైంసాలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ బాపురావు పటేల్, మాజీ ఎంపీటీసీ గంగాధర్, మాజీ మైనార్టీ మండల అధ్యక్షుడు హైమద్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సాయబ్ రావు పటేల్‌తో పాటు వివిధ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేలా ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా ముధోల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేలా కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలుగా ముధోల్ నియోజక వర్గాన్ని ఎలాంటి అభివృద్ధి పర్చకపోవడంతో గ్రామాలు గతంలో ఉన్న విధంగానే ఉన్నాయని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తుందని అన్నారు. అదే విధంగా గోడపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ఓం ప్రకాష్ లడ్డా, భోజరాం పటేల్, కుప్టి మాజీ సర్పంచ్ రమేష్, గోడపూర్ గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు ఎంతో భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను జరుపుకున్నారు. యేసు క్రీస్తు మానవాళి కోసం చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హోలీ ఫ్యామిలీ క్యాథలిక్ చర్చిలో యేసు క్రీస్తు చేసిన త్యాగాలను ఫాదర్లు వివరించారు. యేసు త్యాగాలను స్తుతిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం పట్టణ వీధులగుండా సిలువ యాత్ర నిర్వహించారు. యేసు సిలువను మోసిన దృశ్యాలను కండ్లకు కట్టేలా యాత్ర జరిపారు. సిలువలను చేతపట్టుకుని క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలను ఆలపించారు. జీసస్ బోధనలలోని మానవీయ తత్వాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని ఈ సందర్భంగా ఫాదర్‌లు సూచించారు. క్రీస్తు మానవాళికి ఇచ్చిన శాంతి సందేశాన్ని గుడ్ ఫ్రైడే సందర్భంగా అందరూ పున:శ్చరణ చేసుకోవాలన్నారు. కరుణామయుడైన క్రీస్తు అనుసరించిన ప్రేమ, దయ, శాంతి, సహనం, త్యాగం వంటి విలువలు, శత్రువునైనా ప్రేమించమనే ఆదర్శం సమస్త మానవాళి ఆదర్శప్రాయమని సూచించారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఏసు క్రీస్తు అడుగు జాడల్లో ముందుకు నడువాలని రెవరెంట్ బి.కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలువపై పలికిన ఏడు మాటలు గురించి, ఏసుక్రీస్తు భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, సంద్రాల జాన్, నక్క శ్యామ్‌సన్, బిరుదుల దేవదాస్, కోటికెలాగెస్ట్, బిరుదుల లాజర్, ఎల్మల మనోహర్, కొమ్ము బాపురావు, చొప్పదండి కాంతారావు, ఎల్మల రవి, మహిళలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు ఇచ్చిన సామాజిక కార్యకర్త కేశవ్

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలో కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో జమ మసీద్‌లో శుక్రవారం ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా వారికి ఇఫ్తార్ విందును సామాజిక కార్యకర్త మెస్రం కేశవ్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు ప్రతి ఒక్కరూ తమ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ఈ విందులో ముస్లింలు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలోని స్థానిక జమ మసీద్‌లో శుక్రవారం ముస్లింలు నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగ మాసంలో అందరూ భక్తి మార్గంలో నడిచి, ప్రతి ఒక్కరూ పండుగను శాంతియుతంగా ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. వీరితో మండల ముస్లింలు, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





కాలనీల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు : స్పెషల్ ఆఫీసర్

- కేఆర్‌కే కాలనీలో పర్యటించిన బృందం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

వేసవిలో పట్టణంలోని వీలిన వార్డులు, కాలనీల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదిలాబాద్ మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అన్నారు. నీటి సమస్యలను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారుల బృందం కేఆర్‌కే కాలనీలో పర్యటించిందని తెలిపారు. శుక్రవారం కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో కలిసి ఆయన కాలనీలో నీటి సమస్యల గురించి తెలుసుకున్నారు. ముందుగా ట్యాంక్‌ను పరిశీలించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ నీరు అందిస్తున్న తీరు గురించి అడిగారు. ఈ సందర్భంగా కాలనీలోని వృద్ధాశ్రమమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈ తిరుపతి, టీపీఓ అనురాధ, ఏఈ అరుణ్, మున్సిపల్ సిబ్బంది పెంటయ్య, కాలనీ వాసులు ముబారక్, రాజు ఉన్నారు.

నీటి సమస్యను అధిగమించేందుకు చర్యలు..!

ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నీటి సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోవాడానికి కాలనీలో పర్యటించడం జరిగిందన్నారు. కాలనీలో 15 వేల జనాభా ఉందని వేసవిలో నీటి ఎద్దడి లేకుండా మున్సిపల్ తరపున ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ మాట్లాడుతూ కేఆర్‌కే కాలనీ పర్యటనలో తమకు నీటితో పాటు మురికి కాలువల సమస్యలు దృష్టికి వచ్చాయని తెలిపారు. ఎన్నికల కోడ్ తరువాత దశాల వారీగా ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుత వేసవిలో నీటి సమస్యలను తీర్చేందుకు మున్సిపల్ తరపున రెండు ట్యాంకర్లను ఏర్పాటు చేశామన్నారు. రోజు ఇవీ నీటి సమస్య ఉన్న చోట నీటిని సరఫరా చేస్తాయని తెలిపారు.

కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సీఐ సైదారావ్



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సైదారావు మాట్లాడారు. కాలనీలు, గ్రామాలకు కొత్తగా వచ్చే వ్యక్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమైనా అనుమానం కలిగితే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకొని పోలీసులు అడిగినప్పుడు చూపించాలని అన్నారు. కాలనీల్లో అనుమాన స్పదంగా తిరిగే వ్యక్తల సమాచారాన్ని పోలీసులకు తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఎంపీగా గెలిపించండి అభివృద్ధి చేస్తా'



నవతెలంగాణ-సిరికొండ

బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా గెలిపిస్తే జిల్లాను మరింత అభివృద్ధి చేస్తానని ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తిగా మళ్లీ మీ ముందుకు వచ్చానని, ఒకసారి ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, మండల అధ్యక్షుడు అమోల్, నాయకులు మాణిక్ రావ్, బాలాజీ, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నేరడిగొండ



కొడుకు వేధింపులు తట్టుకోలేక తండ్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాజుల తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు మాలి నూర్‌సింగ్(49)కు ఇద్దరు భార్యలు. రెండో భార్యకు ఇద్దరు సంతానం, మొదటి భార్య కుమారుడైన అంకుష్ పెండ్లి చేసుకొని వేరుగా ఉంటున్నాడు. అంకుష్ తన తండ్రి ఆస్తిలో వాటా కావాలని ప్రతి రోజు వేధించగా అతని వేధింపులు తట్టుకోలేక చాలా సార్లు సముదాయించిన మార్పు రానందున ఉదయం ఏడు గంటల ప్రాంతంలో తన చేనులో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై మారుతి తెలిపారు.

వికలాంగుడికి వీల్‌చైర్ అందజేత



నవతెలంగాణ-బోథ్

మండలంలోని గుర్రాల తండా గ్రామానికి చెందిన రఘువీర్ సింగ్ అనే యువకుడు గత కొన్ని సంవత్సరాలుగా అంగ వైకల్యంతో బాధ పడుతున్నాడు. శుక్రవారం తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వికలాంగుడైన యువకుడికి వీల్‌చైర్‌ను అందించారు. గతంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ గ్రామ పర్యటనలో భాగంగా అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. అప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం ఆయనకు వీల్ చైర్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఇర్ల అఖిల్, గౌతమ్‌రెడ్డి, అభిలాష్, సుధీర్‌రెడ్డి, తుల హరీష్, శ్రీను, గణేష్, అభిలాష్, మృణాల్ గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో తెలంగాణ స్టూడెంట్ ఫోరమ్ సొసైటీ ఆధ్వర్యంలో ఓసియన్ కంప్యూటర్ సౌజన్యంతో వేసవి సెలవులను ఉద్దేశించి విద్యార్థుల భవిష్యత్తు కొరకు, సాంకేతిక పరిజ్ఞానం కొరకు ప్రారంభిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమయ్యాయి. శుక్రవారం జిల్లా నలుమూలల నుంచి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ అధ్యక్షులు రాహుల్ మాట్లాడుతూ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓసియన్ కంప్యూటర్ యాజమాన్యం, సిబ్బంది మహేష్ సింగ్, సాయికుమార్, వేణు, అంకిత, సత్యనారాయణ, టీఎస్ఎఫ్ నాయకులు ఇఫ్తీకార్, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.



ప్రారంభమైన మొర్రి పండ్ల సేకరణ



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ బిడ్డలు అటవీని నమ్ముకొని, అటవీ ఉత్పత్తులే తమ జీవనాధారంగా బావించి, తమ జీవితాలను కొనసాగిస్తారు. అందులో బాగంగానే ఆదివాసులు మొర్రి పండ్ల సేకరణను ప్రారంభించారు. వాటి నుంచి వచ్చిన ఆదాయంతో వారు తమ కుటుంబ పోషణకు అవసరమయ్యే నిత్యవసరాలను తెచ్చుకొని జీవిస్తారు. సేకరించిన మొర్రి పండ్లను సేకరించి, మార్కెట్‌లో ఒక గ్లాస్‌కు పది రూపాయల చొప్పున అమ్ముతామని పేర్కొన్నారు. ఉపాధి లేక అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. అవి రుచిగా ఉండటంతో తెచ్చిన వెంటనే అమ్ముడు పోతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎంబడి సంతోష్ కుమార్‌ను, ఆదిలాబాద్ జిల్లా మాల సంక్షేమ సంఘం అడహక్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడహక్ కమిటీ జిల్లా కన్వీనర్ సింగరి అశోక్, మాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బేర దేవన్న, సీనియర్ నాయకులు మేకల మల్లన్న, దాసరి బాబన్న, పాశం రాఘవేందర్, రాళ్లబండి శంకర్, చిలక పొచ్చన్న, సంటి రవి, మేదరి స్వామి, కుట్ల రమేష్, కొప్పుల రమేష్, తొగరి ప్రకాష్, ముచ్చ రఘు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని చిచ్‌ధరి ఖానాపూర్ గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 76 మందికి రక్త పరీక్షలు చేయించి, ఉచితంగా మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్త సత్యవతి, శైలజ, ల్యాబ్ టెక్నిషీయన్ శ్రీనివాస్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మోడీని పీఎం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్



నవతెలంగాణ-ఉట్నూర్

మోడీని పీఎం చేయడమే లక్ష్యంగా బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా, కలిసి కట్టుగా పనిచేయాలని, ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సేవాదాస్ నగర్ రాథోడ్ రమేష్ నివాసంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. రాథోడ్ రమేష్‌తో పాటు ఉట్నూర్ మండల నాయకులు, గోడం నగేష్ మాట్లాడుతూ ఎన్ని పార్టీలు కలిసి వచ్చిన ఆదిలాబాద్ పార్లమెంట్‌లో గెలిచేది బీజేపీదేనని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి బీజేపీ జెండాను ఎగరవేస్తామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కటుగా ఉంటూ సైనికులుగా పని చేస్తే తప్పనిసరిగా గెలుపు మనదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు గుగ్లోత్ శ్రీరామ్ నాయక్, రితేష్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారి రమేష్, మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆసిఫాబాద్‌లో 5కే రన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికలలో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం నుండి అంబేద్కర్ చౌక్ వరకు 5కే రన్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ నుండి ఎస్‌పీఎం మైదానం వరకు స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా 5కె రన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా ఎన్నికలు, ఓటు నమోదుపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | మార్చి 30, 2024 | www.navatelangana.com

రేపటి మంత్రి సీతక్క మీటింగ్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బెజ్జూరు



జిల్లా ఇన్‌చార్జి సీతక్క ఈ నెల 31న నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు బూస శంకర్ కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి సీతక్క పర్యటనను విజయవంతం చేయడానికి ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఆమెతో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి సుగుణక్క వస్తున్నారని తెలిపారు. కార్యకర్తలంతా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను బూత్ లెవల్ స్థాయిలో తీసుకెళ్లాలని కోరారు. అనంతరం బూత్ ఇన్‌చార్జిలకు ఓటరు లిస్టులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అకిమ్, బాబాజీ, రాజారాం, శైలేష్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

అరిగెల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో అరిగెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముస్లీం సోదరులకు శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరయ్యారు. ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగల్ విండో చైర్మన్ అలిబిన్ హైమద్, నాయకులు రెహమాన్, భీమేష్, అబ్దుల్లా, ఫయాజ్, అమన్, హైమద్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుండి నిరవధిక సమ్మె

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్
- పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

టీవీవీపీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగులోని వేతనాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి దివాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లోని సీహెచ్‌సీ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డాక్టర్ రానాకు వినతిపత్రం అందించి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీవీపీ కమిషనరేట్ క్రింద జిల్లా ఏరియా ఆస్పత్రుల్లో మరియు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి 4 నెలల నుండి వేతనాలు చెల్లించటం లేదని, స్థానిక మెడికల్ సూపరింటెండెంట్లను, వైద్య అధికారులను సంప్రదించగా తమకు తెలియదని కాంట్రాక్టర్లతో మాట్లాడమని చెబుతున్నారని అన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లను అడుగగా మా అగ్రిమెంట్ ప్రకారం ప్రభుత్వం బిల్లు చెల్లించడంలో జాప్యం జరడంతో మూడు నెలల వరకు జీతాలు చెల్లించాలనే నిబంధన ఉందన్నారు. ఆ నిబంధన ప్రకారం బిల్లు రాకపోయినప్పటికి 3 నెలల వరకు జీతాలు కాంట్రాక్టర్ చెల్లించాలన్నారు. మార్చి 25 తేది వరకు బకాయి వేతనాలు చెల్లించని పక్షంలొ ఏప్రిల్ 1 నుండి నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేష్, సహాయ కార్యదర్శి సత్తార్ బేగ్, నాయకులు లక్ష్మణ్, హరీష్, నవీన్ పాల్గొన్నారు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. శుక్రవారం సీఐ ఆధ్వర్యంలో గంగాపుర్, కొర్సిని, బూరెపల్లి, రణవెల్లి గ్రామాలలో సీఆర్పీఎఫ్ సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అల్లర్లు జరుగకుండా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా పోలీసులకు అందరూ సహకరించాలన్నారు. అంతకు ముందు సాయిధ బలగాల కవాతును సీఆర్పిఎఫ్ కమాండెంట్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

సూక్ష్మ విరాళాల ద్వారా మద్దతివ్వండి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భారతీయ జనతా పార్టీకి ప్రతీ ఒక్కరు సూక్ష్మ విరాళాల మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన పదేండ్ల కాలంలో బీజేపీ దేశానికి అవినీతిరహిత పాలన అందించిందని, ఇలాంటి పార్టీకి ప్రజలు విరాళాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. నమో యాప్ ద్వారా ప్రజలు రూ. 5 నుండి మొదలుకొని రూ. 2వేల వరకు విరాళాలు అందించవచ్చని సూచించారు. దేశాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే వారు ఈ విరాళాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, ఉపాధ్యక్షులు చన్కపురి గణపతి, తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, కోశాధికారి అరుణ్‌లోయ, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, మండల అధ్యక్షులు రణవీర్ బిస్వాస్, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, గౌత్రె వెంకటేష్, కొండ తిరుపతి, జాడి మధూకర్, తాటి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు సూక్ష్మ విరాళాల ద్వారా మద్దతు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు బీజేపీకి మైక్రో డొనేషన్ ద్వారా మద్దతు ఇవ్వాలని కోరారు. దేశాన్ని అభివృద్ధి చేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అకుంఠ దీక్షతో పని చేస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా బీజేపీని బలోపేతం చేయడానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు విశాల్ ఖండ్రే, తాలూకా కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, మండల అధ్యక్షులు శ్రీధర్, సూర్య ప్రకాష్, ప్రోగ్రాం మీడియా కన్వీనర్ సప్త శ్రీనివాస్, గణేశ్, పసునూరి తిరుపతి, పెంటు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

- జోరుగా బెల్టుషాపుల నిర్వహణ
- మత్తులో విచక్షణ కోల్పోతున్న యువత
- కార్యాలయానికే పరిమితమైన ఎక్సైజ్ అధికారులు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గ్రామాల్లో బెల్టుషాపులు, గల్లీగల్లీకో అక్రమ మద్యం దుకాణాలు నెలకొల్పి మద్యం వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు బీర్లు అన్న చందంగా నిర్వహిస్తున్నారు. మద్యం విచ్చలవిడిగా ఏరులై పారుతుంది. ఒక్క గ్రామంలో కనీసం ఐదు నుండి పది బెల్టుషాపులు నడుస్తున్నాయి. బెల్టుషాపుల్లో ప్రతిరోజు సుమారు రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు అమ్మకాలు జరుగుతున్నాయని బాహాటంగానే చెప్పవచ్చు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారులు మాత్రం చూసిచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. మద్యానికి బానిసై కుటుంబంలో చిచ్చురేపుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహించడమేనని ఆరోపిస్తున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో కనీసం గ్రామానికి 10 నుండి 15 వరకు బెల్టుషాపులు కొనసాగుతున్నాయని తెలిసింది.

గల్లీ కో బెల్టు షాపు..

గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చినా గల్లీకో డాక్టర్ లేరు కానీ గల్లీకో బెల్టుషాపు మాత్రం అద్దంలా కనబడుతున్నాయి. వైన్స్ షాపుల్లో మద్యం దుకాణాలు తెరవడానికి ఉదయం 11 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఉంటాయి. కానీ బెల్టుషాపుల్లో 24 గంటల్లో ఏ సమయానికి వెళ్లిన మద్యం లభిస్తుంది. దీంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోయాయని, యువత ఈ మద్యానికి బానిసై అటు మహిళలపై అఘాయిత్యాలు, మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదంలో యువత ప్రాణాలు కోల్పోతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మద్యం దుకాణ నిర్వాహకులు ప్రయివేటు సైన్యాన్ని తయారుచేసుకొని బెల్టుషాపులకు మద్యం ఎంఆర్‌పీ ధర కంటే రూ. 20 నుండి రూ.40 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొన్ని వైన్స్ షాపుల్లో ఆటోలు పెట్టి బెల్టుషాపులకు నేరుగా వైన్స్ షాపు దారులు మద్యం పంపిణీ చేస్తున్నారని ఆరోపణలున్నాయి. మద్యం దుకాణాలను లైసెన్స్ ఉన్నవారే కాకుండా పరిమితికి మించి విక్రయ దారులు మద్యం దుకాణాలు ఉండడంతో పాటు కల్తీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మద్యాన్ని బెల్టుషాపు లోపలికి తీసుకెళ్తున్న వ్యాపారులు

కిరాణ దుకాణాల్లో విక్రయాలు...

గ్రామాలు, పట్టణాలు, కాలనీల్లో బెల్టుషాపులు చాలా వరకు నిత్యావసర సరుకులు, కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇండ్లలోనే బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. రహదారుల వెంట ఉన్న దుకాణాల్లో దర్జాగా మద్యం విక్రయాలు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్టుషాపులను తనిఖీలు నిర్వహించి ప్రజలు అధికంగా ఉండే కాలనీల్లో బెల్టుషాపులకు అనుమతి ఇవ్వకూడదని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం సంబంధిత మండల అధికారులు పట్టించుకొని యువత చెడు మార్గాలు పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు కోరుతున్నారు.

బెల్టుషాపులను అరికట్టాలి

సొల్లు లక్ష్మీ, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఊరి చివరలో వైన్స్ షాపు ఉండాలనే నిబంధన ఉంది. కానీ కిరాణ దుకాణాలలో మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో యువత అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకుంటుంది. బెల్టు షాపులను పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మూసివేసేల చూడాలి.

బెల్టుషాపుల్లో అమ్మకాలు

గూగుల్ రవినాయక్, బీజేపీ నాయకుడు.



గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే పట్టించుకొని కాలనీల్లో, కిరాణ దుకాణాల్లో మద్యం నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

కఠిన చర్యలు తీసుకోవాలి

దుర్గం రవీందర్, కాంగ్రెస్ నాయకులు



గ్రామాల్లో ఊరి చివరలో వైన్స్ షాపు ఉండడం వల్ల నేరుగా వైన్స్ షాపు దారులు బెల్టుషాపులకు ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొవాలి.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి వచ్చి పేద ప్రజలకు రూ.2 కే కిలో బియ్యం అందించారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి, ఎస్సీ, ఎస్టీ, బీసీలను రాజకీయంగా చైతన్యపర్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. దీనికి ముందు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి లావణ్య, సౌభాగ్యలక్ష్మి, దేవేందర్, గులాబ్‌రావు, మధూకర్, చల్లూరి శంకర్, యలమంచిలి శ్రీనివాస్, సంజీవ్, సమ్మాగౌడ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాల్య వివాహాలు జరిపిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం పర్సనంబాల గ్రామంలో బాల్య వివాహం జరిపిస్తున్నారని సమాచారం అందడంతో సంబంధిత అధికారుల సమన్వయంతో గ్రామానికి చేరుకొని వివాహాన్ని నిలిపివేశారు. ఈ సందర్భంగా అమ్మాయి, అబ్బాయిలతో పాటు వారి తల్లిదండ్రులకు బాల్య వివాహం చేయడం వలన కలిగే నష్టాలను వివరిస్తూ కౌన్సిలింగ్ ఇచ్చారు. అమ్మాయికి 18 సంవత్సరాల వయస్సు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. ముందుగా చేసినట్లయితే వయస్సు ప్రభావం చేత ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన తర్వాత వివాహం జరిపించేందుకు ఇరువురి తల్లిదండ్రులు అంగీకరించారు. బాలిక సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లుగా తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. బాల్య వివాహాల నిరోధనానికి ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ్యలక్ష్మి, సీడీపీఓ సదియా రుక్సానా, జిల్లా బాలికా సంరక్షణ అధికారి మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాల్య వివాహాల గురించి కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

తప్పుల తడకగా సింగరేణి భూ సేకరణ సర్వే

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామంలో నూతనంగా ప్రారంభించనున్న గోలేటి(1) మెగా ఓసీకి 58.09 ఎకరాల అదనపు భూ సేకరణ నోటిఫికేషన్ రెవెన్యూ శాఖ విడుదల చేసింది. అనంతరం భూ సేకరణ ప్రక్రియ హుటాహుటిన చేపట్టింది. ఈ క్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు వ్యవసాయ భూముల్లో పంట లేని సమయంలో సర్వే చేయడం వల్ల నిజమైన భూ యజమానులకు బదులు ఇతర బీడు భూముల్లో ఫోటోలు దిగి భూ సేకరణలో లబ్ది పొందబోతున్నారు. దీంతో నిజమైన భూ యజమానులకు భూ విస్తీర్ణాన్ని తక్కువ చేసి రెవెన్యూ అధికారులు రైతులతో దోబూచులాడుతున్నారు. సాయిన్‌కెట్ ఆఫీస్ కోసం తీసుకున్న భూమిలో అత్యంత నిరుపేదలు, దళితులు ఎన్నో ఏండ్లుగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గతంలో వీరికి పట్టా పాస్ పుస్తకాల కోసం రెవెన్యూ అధికారులను సంప్రదించగా అటవీ, రెవెన్యూ వివాద భూమిగా ధరణిలో నమోదైందని, పట్టాలు ఇవ్వకుండా రెవెన్యూ విభాగం కాలయాపన చేసింది. ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం గృహ నిర్వాసితులు లేని సమయంలో ఇంటి కొలతలు తీసుకోవడం, సామాజిక తనిఖీ విషయంలో కూడా సింగరేణి ఎస్టేట్ విభాగం అధికారిని మాత్రమే విచారణ చేయడం పలు అనుమానాలకు తావిస్తుంది. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే బాధిత నిజమైన భూమి రైతులకు జీవనోపాధి పునరావాసం కాకుండా పోయిందని బాధితులు ఆరోపిస్తున్నారు. సింగరేణి అధికారులు మాత్రం భూ సేకరణలో అవార్డు ప్రక్రియ పూర్తయ్యే విధంగా దళారాలను రంగంలోకి దింపి రైతులను బెదిరిస్తూ కోర్టు కేసులు పెడతామని బెదిరిస్తు, మీకు డబ్బులు రావని సంతకాలు సేకరించే విధంగా ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల కన్ను సన్నల్లోనే ఇంత జరుగుతుందని ప్రజలు విమర్శలు గురిపిస్తున్నారు. ఈ విషయంపై రైతులు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నప్పటికి ఫలితం రావడం లేదని వాపోతున్నారు. రికార్డుల ప్రకారం అర్హులైన వారికి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. అవార్డు పాసైతే సివిల్ కోర్టులో డబ్బులు డిపాజిట్ చేసి చేతులు దులుపుకోవాలని సింగరేణి అధికారులు వేచిచూస్తున్నారు. నిజమైన భూమి యజమానులకు న్యాయం చేయాలని పలువురు బాధితులు కోరుతున్నారు. నూతనంగా ఏర్పాడిన ప్రభుత్వంలోనైన తమ సమస్యలకు పరిష్కరం లభిస్తుందని ఆశతో ఉన్నారు.

శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలి



నవతెలంగాణ-రెబ్బెన

రాబోయే పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎలాంటి వర్గబేదాలు లేకుండా, అల్లర్లు జరుగకుండా ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ సదయ్య అన్నారు. మండలంలో సీఆర్‌పీఎఫ్ దళాల ఫ్లాగ్‌మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పారా మెటల్ దళాల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించి వారికి ఎన్నికలకు సంబంధించిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ సూచించిన గైడెలైన్స్ ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఇప్పటి నుండే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఎవరైన చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. గ్రామంలోని ప్రజలు ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే గ్రామం, జిల్లా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కావునా ప్రజలంతా వర్గవిబేధాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేల సహకరించాలని ఆయన కోరారు. ఒకరికొకరు కలిసిమెలిసి సామరస్యంగా ఉండాలని సూచించారు. ప్రజలంతా ఎలక్షన్ సమయంలో పోలీసు వారికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంట గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలో గుడుంబ తయారు చేయడానికి ఉపయోగించే బెల్లం, బెల్లం పానకం, పట్టిక, గుడుంబా పట్టుకున్నారు. అనంతరం గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలను తయారు చేసిన, విక్రయించిన చట్ట విరుద్ధమన్నారు. సరైన ధృవీకరణ పత్రాలు కలిగిన వాహనాలనే నడపాలని, మద్యం ఆరోగ్యానికి హానికరమని, దీనివల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. అనంతరం పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలో కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సౌకార్యాలు కల్పించేల చూడాలని సూచించారు. ఆయన వెంట కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ దీకొండ రమేష్, ఏఎస్ఐ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞాన యాత్ర

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పీఎం శ్రీశ్రీ విద్యా వైజ్ఞానిక యాత్రలో భాగంగా జోడేఘాట్ గ్రామంలో గల కుమురం భీం మ్యూజియం సందర్శనకు పాఠశాల విద్యార్థులందరిని ప్రత్యేక వాహనంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మళ ఆధ్వర్యంలో శుక్రవారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మ్యూజియంలో గిరిజనుల జీవన విధానం, వారు వాడే వస్తువులను, కుమురం భీం స్తూపం గురించి వివరించారు. అలాగే కుమురం భీం చరిత్రను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, గంగాభవానీ, సుజాత, లక్ష్మీ, నాగేష్, కళావతి, భారతి, శ్రీధర్, సాయి పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలో గుడుంబా విక్రయిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన పాండవుల భీమన్న వద్ద 8.5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు చేపడుతామన్నారు. గుడుంబా తయారు చేసిన విక్రయించిన చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో గుడుంబా తయారు చేసిన, విక్రయించిన వారి వివరాలు తెలియజేయాలని, సమాచారం అందించిన వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

ట్రాక్టర్‌తో ఇంటిపై యువకుని దాడి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పాతకక్షలను మనసులో పెట్టుకుని ప్రతీకారం తీర్చుకునేందుకు ఓ యువకుడు ట్రాక్టర్‌తో వచ్చి పలువురి ఇళ్లపై దాడికి యత్నించగా అడ్డుకున్న నలుగురు వ్యక్తులు గాయాలపాలైన ఘటన ఈజ్ గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని విలేజ్ నెంబర్ 7లో శుక్రవారం చోటు చేసుకుంది. ఈజ్ గాం ఎస్సై రామన్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విలేజ్ నెంబర్ 7కు చెందిన ప్రశాంత్ దాస్‌కు ఇదే గ్రామానికి చెందిన తుషార్ మిర్జాకు మధ్య పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో తూషార్ మిర్జా శుక్రవారం ట్రాక్టర్‌తో ప్రశాంత్ దాస్ ఇంటికి దాడి చేసేందుకు వచ్చాడు. ప్రశాంత్ దాస్‌తో పాటూ బాపిదాస్, సుశ్మితదాస్, సుజోతదాస్ అడ్డుకునే ప్రయత్నం చేయగా అదే ట్రాక్టర్‌తో వీరిని ఢీకొట్టడంతో గాయపడ్డారు. ఇరుగుపొరుగు ఘటన స్థలానికి చేరుకోవడంతో తుషార్ మిర్జా ఈజ్గం పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులకు లొంగిపోయాడు. ఘటనస్థలాన్ని రూరల్ సీఐ రాంబాబు సందర్శించి విచారణ చేపట్టారు. ప్రియ బద్రిదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామన్ కునార్ తెలిపారు.

చెక్ పోస్ట్ వద్ద రూ.52,400 నగదు సీజ్

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం పోలీసులు రూ.52,400 నగదును సీజ్ చేశారు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా బెల్లంపల్లికి చెందిన రాంభట్ల వేణుగోపాల్ శర్మ రూ.52,400 నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగుదును తదుపరి చర్యల నిమిత్తం ఎస్ఎస్‌ఈ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వివరించారు.

ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీకాంత్, అభినవ్

నవతెలంగాణ-నస్పూర్





భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీకాంత్, అభినవ్ నూతనంగా ఎన్నికయ్యారు. జిల్లాలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాలుగవ మహాసభల్లో రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య రంగా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తామని అన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని అన్నారు. విద్యార్థుల సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించాలని లేనిపక్షంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందారం, టేకుమట్ల గ్రామ పంచాయతీ ఉప సర్పంచులు మౌనిక, గుడిగందుల లక్ష్మినారాయణ సాగర్, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు చిప్పకుర్తి వెంకన్న, ఆసంపల్లి మల్లయ్య, చిప్పకుర్తి పోషం, రాజ్ కుమార్ యాదవ్, శంకర్, సోషల్ మీడియా నుంచి ఆసంపల్లి శివ, చిప్పగుర్తి సతీష్ తదితరులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.

అనుమతులు లేకుండా అక్రమ కట్టడం



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపల్ పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. అడ్డుకట్ట వెయ్యాల్సిన అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు ఇష్టానురాజ్యాంగ వ్యవరిస్తున్నారు. స్థానికంగా మంచిర్యాల కలెక్టరేట్‌కి కూతవేటు దూరంలో ఉన్న సీతారాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు ఖాళీ స్థలంలో అనుమతి లేకుండా అక్రమ కట్టడలను నిర్మిస్తున్నారు. బహిరంగంగా జరుగుతున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణానికి నిబంధనలు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న విద్యుత్ అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాసిపేట-2 గనిపై మ్యాన్ రైడింగ్ రోప్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై మ్యాన్ రైడింగ్ రోప్ పనులను శుక్రవారం గని మేనేజర్ లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. ఈ సంధర్భంగా మేనేజర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ వీలైనంత త్వరగా మ్యాన్ రైడింగ్ ప్రారంభించాలని, కార్మికుల రక్షణ దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ మ్యాన్ రైడింగ్ పూర్తి దశకు చేరుతున్నాయన్నారు. మ్యాన్ రైడింగ్ తో హాజరు శాతం కూడా పెరిగే అవకావం ఉందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంజనీర్ల పర్యవేక్షణలో మ్యాన్ రైడింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్‌లో మ్యాన్ రైడింగ్ అందుబాటులో వస్తుందని చెప్పడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ సంతోష్ రావు, ఇంజనీర్ రఘు, కృష్ణ ప్రసాద్, ఐఎన్టీయూసీ నాయకులు కారుకూరి తిరుపతి, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి గోళ్ల శ్రీనివాస్, ఓర్మెన్ సెగ్గం శ్రీనివాస్, సుభాశ్ చంద్రబోస్, సర్దార్ కొత్తపల్లి శంకరయ్య పాల్గొన్నారు.

హెల్త్ డిపార్ట్మెంట్ ఏఐటీయూసీ ఫిట్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ డిపార్ట్మెంట్ ఫిట్ కమిటీని డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కే వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. ఫిట్ కార్యదర్శిగా విజయలక్ష్మి, ఫిట్ సహాయ కార్యదర్శిగా బోయిని రమణ, సంయుక్త కార్యదర్శిగా జి శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొల్లూరు తిరుపతి, కోశాధికారిగా ముద్దసాని మల్లేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అరుణకుమారి, విజయలక్ష్మి మంజుల, నాగేంద్ర వర్మ, లింగమూర్తిలను ఎన్నుకున్నారు. అనంతరం డివైసిఎంఒకు వారిని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోయిందనుకున్న మొబైల్ ఫోన్ దొరికింది

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ అంకుషాపూర్ గ్రామానికి చెందిన కోట రాజ్ కుమార్ మొబైల్ ఫోన్ గత ఆరు నెలల క్రితం పోయింది. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసిన భీమారం పోలీసులు పోయిందనుకున్న మొబైల్ ఫోన్ గుర్తించారు. శుక్రవారం మొబైల్ ఫోన్ యజమాని కోట రాజ్ కుమార్‌కు అందజేశారు.మొబైల్ ఫోన్ ఎవరైనా పోగొట్టుకున్న సందర్భంలో సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్ వివరాలు పొందుపరచాలని స్థానిక ఎస్ఐ రాములు తెలిపారు.

ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

నవతెలంగాణ-నస్పూర్



రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని శ్రీరాంపూర్ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ సర్కార్ అనేక ప్రజావ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి రైతుల్ని, కార్మిక వర్గాన్ని, పేదలని నట్టేట ముంచిందని ఆయన విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని తీసుకురావాలనేటువంటి కుట్ర ఒక పక్క సాగిస్తూ, మరో వైపు దేశంలో లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థ మీద దాడులు సాగిస్తూ సిఏఏ, ఎన్ఆర్సీ లాంటి ప్రమాదకరమైనటువంటి చట్టాలను పార్లమెంట్లో మందబలంతో ముందుకు తీసుకొచ్చి మైనార్టీల మీద దాడులు సాగించడానికి పూనుకుంటుందన్నారు. మంచిర్యాల జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా తీవ్రమైన తాగునీటి సమస్య ఏర్పడింది. వెంటనే జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎండ తీవ్రత నుంచి ప్రజల ఉపశమనానికి బస్టాండు, చౌరస్తా, వివిధ కూడలాల్లో సంబంధించిన అధికారులు స్పందించి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు విధుల సమయాన్ని మార్చాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజేశ్వరి, ప్రకాష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చందు, దూలం శ్రీనివాస్, దుంపల రంజిత్ కుమార్, రాజారాం, అశోక్, వివిధ మండలాల నాయకులు ఉమారాణి, సమ్మక్క, నగేష్, రమేష్, ఎల్లయ్య, రాజలింగు, శ్రీకాంత్, దేవదాసు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా గుడ్ ఫ్రైడే



లక్షెట్టిపేటలో..

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మానవాళి కోసం కరుణామయుని త్యాగమే గుడ్ ఫ్రైడే సందేశమని, జీసస్ జీవితమే మానవాళికి గొప్ప సందేశం అని లక్షెటిపేట సిఎస్ఐ చర్చి ప్రెస్బిటర్ ఇంచార్జ్ రెవ ఎస్.డేవిడ్ పాల్ తెలిపారు. శుక్రవారం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తును సిలువ వేసిన రోజు గుడ్ ఫ్రైడే, ఆ తర్వాత ఆయన పునరుజీవించిన ఈస్టర్ సండే రోజున నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు రోజులు మానవాళి చరిత్రను మలుపు తిప్పిన ఘట్టాలు అని పేర్కొన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమాపణ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా జీసస్ లోకానికి ఇచ్చిన సందేశాలు అని తెలియజేశారు. ఈ గుడ్ ఫ్రైడే వేడుకల్లో చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థన లో పాల్గొన్న గడ్డం వంశీ

రామకృష్ణాపూర్ : పట్టణంలోని స్థానిక మన్నా చర్చికి శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా కాంగ్రెస్ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ హాజరయ్యారు. పాస్టర్ జాషువా ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్ స్వగృహానికి వెళ్లి వారి కుమారుడు సునీల్ దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడి పాల్గొన్నారు.

మందమర్రి : గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని శుక్రవారం మందమర్రిలోని రోమన్ క్యాథలిక్ కార్మెల్ చర్చిలో ఫాదర్ జిజ్జో ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్దలతో 40 రోజుల పాటు లెంట్ డేస్ శ్రమ దినాలుగా ఉపవాసం ఉంటూ ఏసుక్రీస్తుని ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్స్ జీజో, రెక్స్, జీన్సన్ రెక్టార్ దేవుని వాక్యాన్ని ధ్యానించారు.

కాసిపేట : బెల్లంపల్లి, సోమగూడెం రహదారి మధ్యలోని కల్వరీ చర్చి మినిస్ట్రీస్‌లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిస్టర్ షారూన్ యేసు జీవిత చరిత్రను వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులను దీవించారు.



కాసిపేటలో..

ఆస్తుల కోసం ఎన్ని పార్టీలైనా మారుతారు

- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



నవతెలంగాణ-మందమర్రి

ఎన్నికల్లో గెలిస్తే ప్రజల మధ్య ఉండకుండా వ్యాపారాలు పరిశ్రమలను కాపాడుకోవడానికి ఎన్ని పార్టీలైనా మరుతారని పరోక్షంగా ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. మొదటగా సింగరేణి హై స్కూల్ మైదానం మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. అనంతరం మార్కెట్, బస్టాండ్ ఏరియాలలో వ్యాపారస్థులను కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ స్థానికుడుగా బొగ్గుగని కార్మికుడిగా మీ ముందుకు వస్తున్నానని కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొందరు వలస పక్షులు మాదిరిగా ఎన్నికలు రాగానే వస్తుంటారని, 50 ఏళ్ల వారసత్వ రాజకీయ కుటుంబంలో తాత, పెద్ద నాన్న, తండ్రి, మనువడు గెలిచి పదవులు అనుభవించడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కోటీశ్వరులకు రిజర్వేషన్ వర్తించొచ్చా అని ప్రశ్నించారు. బడా వ్యాపారవేత్తలు రిజర్వేషన్‌లో కాకుండా జనరల్ నియోజకవర్గాల్లో పోటీ చేయాలన్నారు. ఆస్తులు రక్షించుకోవడానికి పార్టీలు మారె కుటుంబం నాపై అసత్య ప్రచారానికి తెరలేపిందన్నారు. గతంలో కూడా నాపై అసత్య ప్రచారం చేసి భంగ పడ్డారని గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజల్ని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జె రవీందర్, ఇన్‌చార్జి శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, బడికల సంపత్, సీనియర్ నాయకులు సూరిబాబు, వేణు, మద్ది శంకర్, విజయ్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్రం సుగుణకు ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా, ప్రకటించిన ఏఐసీసీ, సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి సీతక్కకు ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో, సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా, పంపిద్దామని కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలంతా వర్గ విభేదాలు లేకుండా ఐక్యమత్యంతో, కృషిచేసి సుగుణక్క గెలుపుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు రాజశేఖర్, ఇసాక్, ముత్యం సతీష్, దుర్గం లక్ష్మీనారాయణ, చిందం చంద్రయ్య, హజారుద్దీన్, గంగన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మోపా జిల్లా కన్వీనర్‌గా పులిదాసరి నరేష్

నవతెలంగాణ-జన్నారం



ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(మోపా) జిల్లా కన్వీనర్‌గా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన పులి దాసరి నరేష్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. శుక్రవారం, హైదరాబాదులో మోపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఈ నియామక పత్రాన్ని అందించారు. సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. జాతి అభివృద్ధి ఐక్యత కోసం అందరినీ కలుపుకుని ముందుకు వెళతామని అలాగే ముదిరాజ్‌ల రిజర్వేషన్ సాధనకు కలిసి కట్టుగా కృషి చేస్తానని, అందుకోసం ఐక్య ఉద్యమాలు చేస్తామన్నారు. నాపై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీ సభ్యులకు, రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ప్రధాన కార్యదర్శి సంజీవన్ కుమార్, గౌరవ అధ్యక్షులు జగన్ మోహన్ ముదిరాజ్‌లతో పాటు అన్ని జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు.

జోరుగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-మందమర్రి

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ శుక్రవారం 19వ వార్డు విద్యానగర్‌లో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తాం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని జడ్పీ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఆ పాఠశాల పూర్వ విద్యార్థి మల్యాల వేణుగోపాల్ అన్నారు. ఆ పాఠశాలలో చదువుకున్న వేణుగోపాల్ పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా స్టేజీ, వంటగది నిర్మాణం కోసం రూ.2.30 లక్షల సహాయం అందించారు. వాటిని వేణుగోపాల్ తల్లిదండ్రులు మల్యాల అర్చన బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఎంఈఓ విజయ్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

పెంచిన టెట్ పరీక్ష ఫీజులు తగ్గించాలి

నవతెలంగాణ-వేమనపల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన టెట్ అర్హత పరీక్ష ఫీజులు తగ్గించాలని ఓయూ జేఏసీ నాయకులు దుర్గం మల్లేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే నిరుద్యోగులు హాస్టల్ ఫీజులు, శిక్షణ కార్యక్రమాలు, బుక్స్ కొరకు వేలకు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. 11062 పోస్టులలో డీఎస్సీ నోటిఫికేషన్ భర్తీకి సిద్ధం అయ్యి నోటిఫికేషన్ విడుదల చేసింది. మరో వైపు టెట్ నిర్వహించాకే డీఎస్సీ పెట్టాలని నిరుద్యోగుల డిమాండ్ మేరకు మే నెలలో టెట్, జూలై నెలలో డీఎస్సీ నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సిందిందని వివరించారు. టెట్ పరీక్ష ఫీజు ఒక్కో పేపర్‌కు రూ.1000 ఫీజు నిర్ణయించడంపై నిరుద్యోగుల అభ్యర్థులకు భారం పడనుందని అన్నారు.

బడుగు, బలహీన వర్గాల కోసమే టీడీపీ



నవతెలంగాణ-నస్పూర్

బడుగు, బలహీన వర్గాల కోసమే టీడీపీని నందమూరి తారక రామారావు స్థాపించారని పెద్దపెల్లి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తలారి రాజు అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శ్రీరాంపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం కల్పించాలని లక్ష్యంతో పార్టీని స్థాపించారని, నేటికీ బడుగు, బలహీన వర్గాలలో టీడీపీ చెరగని ముద్ర వేసిందన్నారు. పేదవాడు ఆకలితో అలమటిస్తున్నాడని రెండు రూపాయలకే కిలోబియ్యం అందించి ఆకలి తీర్చారని అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో మొదలైన పార్టీ రాబోయే రోజుల్లో తెలంగాణలో పూర్వవైభవం సంతరించుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గరిగంటి రాజయ్య, రవి, కొట్ల సత్తయ్య, గరిగంటి శివ కుమార్, వడ్లకొండ వెంకన్న, కృష్ణ, రవి, వెంకటేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

రైస్ మిల్ ప్రారంభించిన ఎమ్మెల్యే వివేక్



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం పోలంపల్లి గ్రామ పంచాయతి అంకుషాపూర్ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన సమత ఆగ్రోస్ రైస్ మిల్‌ను స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. శుక్రవారం రైస్ మిల్ ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి వచ్చిన ఆయనకు రైస్ మిల్ యజమాని చీనూరి రాజబాబు దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా వివేక్ వెంకటస్వామిని పుష్పగుచ్చాలతో పాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన నాయకులు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, చల్ల విశ్వంబర్‌రెడ్డి, బేద మల్లేష్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కామన్‌పల్లి శివారులో ఉపాధిహామీ పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు శుక్రవారం టీఏ కానుగంటి రాజేందర్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు పలు సూచనలు సలహాలు అందించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుందని, దానికి అనుగుణంగా కూలీలు తాగునీరు, తదితర వాటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏ సురేందర్, మేట్ గణేష్, కూలీలు పాల్గొన్నారు.